క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకి సేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో ఇండస్ట్రీయల్ ఏరియా సమీపంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో సీఐ గంగాధర్‌రావు తన సిబ్బందితో వెళ్లి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద మూడు కోళ్లు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో తీర్థవాది



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడు కోనేర్ల వద్ద తీర్థవాదిని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజావరోహణను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా సుజాత, వెంకటరత్నం కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



శ్రీనివాసులు



నవనీతమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): భక్తవత్సలనగర్‌కు చెందిన శ్రీనివాసులు (60), రంగనాయకులపేటకు చెందిన నవనీతమ్మ (92) వారి వారి నివాసాల్లో మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో వీరి నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి చెందిన నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. మోటివేటర్లు సుధీర్, ప్రసాద్ సమాచారంతో నేత్రాలను సేకరించారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డికాలనీలో ప్రధాన కాలువపై నిర్మించిన పలు అక్రమ కట్టడాలను సంబంధిత అధికారులు మంగళవారం తొలగించారు. అక్రమ కట్టడాలను ఉపేక్షించబోమని వారు స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): జర్నలిస్టులకు నూతనంగా మంజూరు చేయనున్న అక్రిడిటేషన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని కోరారు. పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రామ్మూర్తి, హనోక్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'

- గుర్తించిన సమస్యలకు వెంటనే పరిష్కారం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : అతి సామాన్యుడికి కూడా తక్షణ సాయం అందేలా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఇందుకు అధికారులు బాగా సహకరిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహ్మదాపురం, తోడేరు సచివాలయ పరిధిలో రత్నగిరి, శాంతినగర్ గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించి నూతన శకానికి నాంది పలికినట్లు తెలిపారు. మహ్మదాపురంలో చేదోడు పథకం కింద నగదు అందలేదని ఓ మహిళ చెప్పిన వెంటనే ఏరియా కోఆర్డినేటర్ ద్వారా ఆమెకు 24 గంటల్లో రూ.10 వేల నగదు అందజేశామన్నారు. తొలిరోజు 'గడప గడపకు..' కార్యక్రమంలో ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు కావాలని కోరిన వెంటనే రెండోరోజు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తున్నామంటే సీఎం ప్రోత్సాహం వల్లనేనన్నారు.

ఇక్కడికి వస్తే ఎంతో ఆనందం

తోడేరు పంచాయతీలోని రత్నగిరి, శాంతినగర్ నా సొంత ఊర్లని, ఇక్కడకు వస్తే సొంతింటికి వచ్చినంత ఆనందంగా ఉంటుందని మంత్రి కాకాణి చెప్పారు. ఈ గ్రామాల్లో ఎక్కడా అసౌకర్యం కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కువ పర్యాయాలు ఇక్కడకు రావాలని తన మనస్సులో ఉంటుందన్నారు. గ్రామస్తులు ఒకటి, రెండు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని అధికారుల ద్వారా వెంటనే పరిష్కరిస్తామన్నారు. శాంతినగర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఏఈలు కసనానాయక్, శివమోహన్, ప్రసాద్, ఏడీఈ సురేంద్రబాబు, ఏఓ వాసు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, సర్పంచ్‌లు ప్రత్యూష, పెంచలమ్మ, ఉప సర్పంచ్‌లు కరిపరెడ్డి కృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు సుగుణ, నేతలు బి.సురేష్‌కుమార్‌రెడ్డి, పి.రణారెడ్డి, కె.చినబ్రహ్మయ్య, అశోక్‌కుమార్‌రెడ్డి, బి.మాలకొండారెడ్డి, ఎ.శశిధర్‌రెడ్డి, స్వరాజ్ పాల్గొన్నారు.

నుడా పరిధిలో 2,150 ఇళ్ల మంజూరు



గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, చిత్రంలో విజయ్‌కుమార్, చలపతిరావు

- సీఎం జగన్, మంత్రి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం : నియోజకవర్గంలోని విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట గ్రామాల్లో దాదాపు 2,150 నూతన ఇళ్లను మంజూరు అయినట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను ఎమ్మెల్యే ప్రసన్న గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మండలాలతో పాటు కొడవలూరు, ఇందుకూరుపేట మండలంలోని కొన్ని గ్రామాలు మాత్రమే నుడా పరిధిలోకి వచ్చాయని, దీంతో అక్కడి వారికే నవరత్నాల్లో భాగంగా ఇళ్లు మంజూరైందన్నారు. అయితే విడవలూరు మండలంలో అర్హులకు ఎదురవుతున్న అవస్థలను అప్పటి కలెక్టర్‌కు వివరించి నుడా పరిధిలోకి నియోజకవర్గం మొత్తాన్ని తీసుకురావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. దీనికి స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది సెప్టెంబర్‌లో విడవలూరు మండలంలోని 15 పంచాయతీలతో పాటు, కొడవలూరు మండలంలోని గొట్లపాళెం, ఇందుకూరుపేట మండలంలోని డేవిస్‌పేట, జగదేవిపేట, కొత్తూరు చినతోపు, నరసాపురం, రాముడుపాళెం పంచాయతీలను కూడా నుడా పరిధిలోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఇలా నూతనంగా నుడా పరిధిలోకి వచ్చిన గ్రామాల్లో 2,150 ఇళ్లను మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఉన్నారు.

సీఎస్సార్ నిధులతో స్వయం ఉపాధి



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టుకు సంబంధించి సీఎస్సార్ నిధుల సహకారంతో మహిళలు స్వయం ఉపాధి ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడం సంతోషంగా ఉందని ఫౌండేషన్ సదరన్ రీజియన్ ప్రతినిధి డాక్టర్ అనీల్ బాలకృష్ణన్ అన్నారు. సీఎస్సార్ ద్వారా సామగ్రి పొంది స్వయం ఉపాధితో రాణిస్తున్న ఎనిమిది మంది మహిళలను మంగళవారం వారు కలుసుకుని, మాట్లాడారు. గుమ్మళ్లదిబ్బ, ఈపూరు వెంకనపాళెం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో దుకాణాల వద్ద మహిళలతో ముచ్చటించారు. స్వయం ఉపాధి ద్వారా వచ్చిన మార్పులను అడిగి తెలుసుకున్నారు. వారి సంపాదన, పొదుపు తదితర అంశాలను చర్చించారు. సీఎస్సార్ హెడ్ రాజేష్‌రంజన్, ఫౌండేషన్ ప్రతినిధులు రమేష్‌బాబు, అనూష జర్వాల తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్‌గా అంకబాబు



నియామక పత్రం అందుకుంటున్న అంకబాబు

పొదలకూరు : వికలాంగ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్‌గా పొదలకూరు మండలం నల్లపాళెనికి చెందిన టి.అంకబాబును నియమిస్తూ మంగళవారం సమితీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.చిన్నసుబ్బయ్య యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జిల్లా, నగర, నియోజకవర్గ, మండలాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వీహెచ్‌పీఎస్ కన్వీనర్ అంకబాబు ఆధ్వర్యంలో అన్ని కమిటీలను నూతనంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం పెంపు



యల్లాయపాళెంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన చిన్నారులు

కొడవలూరు : వేసవి శిక్షణ శిబిరంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో మంగళవారం ఆయన వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం, కథలు వినడం ద్వారా విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడం, చిత్రలేఖనం వేయడం చేయించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి, రిసోర్స్ పర్సన్ వెలగపూడి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు పొలిచర్ల శ్రీనివాసులురెడ్డి, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

- కొడవలూరులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో మంగళవారం బొమ్మలు గీయించడం, కథలు చెప్పించడం చేశారు. కార్యక్రమానికి రిటైర్డ్ టీచర్ వెంకయ్య రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 15వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించుకోవాలని, 16న పరిశీలన జరుగుతుందన్నారు. 17, 18 తేదీల్లో ఎంపికైన వారి వివరాలను వెల్లడిస్తామన్నారు. మండల పరిధిలో ఖాళీలకు సంబంధించి సూరాయపాళెం–1(ఓసీ మహిళ), ఇనుకుర్తి–1(ఓసీ మహిళ), తాటిపర్తి బిట్–1 జనరల్–1, తాటిపర్తి బిట్–2 బీసీ జనరల్–1, బత్తులపల్లి–1(ఎస్సీ మహిళ), పొదలకూరు బిట్–1 బీసీ మహిళ–1, జనరల్–2, పొదలకూరు బిట్–4 బీసీ మహిళ–1 కలిపి మొత్తం తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు.

సీసీరోడ్ల నిర్మాణం ప్రారంభం



కోవూరు : మండలంలోని పడుగుపాడు ప్రాంతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రోడ్లు వేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని కోరారు. దీంతో ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించగా, రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్, రఫీ తదితరులు ఉన్నారు.

కార్మికుల కాలనీలో అగ్నిప్రమాదం



ప్రమాదం జరిగిన ప్రాంతం ఇదే

ముత్తుకూరు : వివిధ పామాయిల్ ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులకు సంబంధించిన కాలనీలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నారికేళపల్లి పంచాయతీలోని బావితోపు వద్ద రేకుల షెడ్లు ఉన్న కాలనీల్లో కొందరు వంట చేసేందుకు చిన్న గ్యాస్ సిలిండర్‌ను వెలిగించారు. అయితే, పైపు లీకై ఒక్కసారిగా మంటలు పైకి లేచాయి. కొద్దిసేపు గందరగోళం నెలకొంది. తేరుకున్న కార్మికులు ఇసుక, నీళ్లతో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, బూట్లు, పెట్టెల్లో దాచుకొన్న ఆధార్ కార్డులు, తదితర పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

అంకితభావంతో పనిచేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మజ

కోవూరు : సచివాలయ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–1ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందని, ఏ చిన్న పొరపాటు జరిగినా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజల సమస్యను పరిష్కరిస్తూ పుస్తక నిర్వహణ చేయాలన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైద్య, ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్‌కు చెందిన డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ గణేష్ మంగళవారం తనిఖీ చేశారు. ఎన్టీఆర్ నగర్, వెంగమాంబ వీధి, జనార్దన్‌రెడ్డి కాలనీ, పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. వైద్య సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల లక్ష్యం, తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

మొలక పోలేరమ్మకు చద్ది సమర్పణ



ఆలయంలో చద్ది సమర్పిస్తున్న భక్తులు

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో మొలక పోలేరమ్మకు మంగళవారం భక్తులు భారీ సంఖ్యలో చద్ది సమర్పించారు. ఈనెల 21వ తేదీ నుంచి అమ్మవారి జాతర గ్రామంలో మూడు రోజులపాటు వైభవంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో జాతరకు ముందుగా రెండు వారాలు చద్ది సమర్పించడం ఆనవాయితీ. దీంతో గ్రామస్తులు అమ్మవారికి చద్ది సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమాలతో గ్రామంలో కోలాహలం నెలకొంది.

చిన్నారులకు మంత్రి కాకాణి అభినందన



సన్మానం అందుకున్న విద్యార్థినులతో మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పది పరీక్షల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతిభ చూపిన ఎ.వైష్ణవి (592), తేజస్వినీ (584), సాయిభార్గవి (582) అనే ముగ్గురు విద్యార్థినులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం అభినందించారు. అనంతరం శాలువ కప్పి సన్మానించారు. భవిష్యత్తులో గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిందిగా విద్యార్థినులకు కాకాణి సూచించారు.

ఆహ్వాన పత్రిక అందజేత

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో లక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి దేవస్థానం నిర్వాహకులు మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దేవస్థానం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంద్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి మంత్రిని కలిసి పత్రికను అందించారు. ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. చొప్పా వెంకటేశ్వర్లు, కండే వాసు దేవరావు, శేఖర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



బుచ్చిరెడ్డిపాళెం : సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న మండలాధికారులు

బుచ్చిరెడ్డిపాళెం : 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ నరసింహరావు తెలిపారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని మంగవారం వారు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల్లో ఎదురయ్యే సమస్యలను తెలిపేందుకు 1902 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, సెబ్ సీఐ సూర్యనారాయణ, ఎస్సై వీరప్రతాప్, ఎఫ్‌డీఓ పొట్టయ్య పాల్గొన్నారు.

విజయవంతానికి కృషి చేద్దాం

కొడవలూరు : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేద్దామని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ గాలి జ్యోతి, ఎస్సై జి.సుబ్బారావు, ఏఓ లక్ష్మి, ఏపీఎం ఎస్.రుక్మిణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, ఈఓపీఆర్డీ వి.నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి పాల్గొన్నారు.

మంచి అవకాశం

ముత్తుకూరు : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మంచి అవకాశం ఏర్పడిందని ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రారంభం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని తిలకించారు. ప్రజల సమస్యలు నేరుగా సీఎం కార్యాలయానికి విన్నవించుకునే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ అవుతుందని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త విధానానికి నాంది పలికిందని డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి సంబంధించి సీఎం జగన్ ప్రసంగాన్ని అధికారులతో కలిసి వారు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులకు మెరుగైన పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, బొందిలి సంఘ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కిశోర్‌సింగ్, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ ఉన్నారు.



కొడవలూరులో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు



ముత్తుకూరు : సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు



కోవూరు : పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు